నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 1 ఫిబ్రవరి 2024 | NIRMAL

## వైద్య సేవలు భేష్

- ప్రభుత్వ దవాఖానలోనే మెరుగైన వైద్యం
- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి


వైద్యులను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐ

నిర్మల్ అర్బన్, జనవరి 31 : ప్రభుత్వ దవాఖానల్లోనే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. ఈనెల 12వ తేదీన నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ కాలనీలో గొడ్డలితో దాడి చేసిన ఘటనలో ఆదిలాబాద్‌కు చెందిన వెంకటేశ్ పేగులు బయటపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. అతనికి ప్రభుత్వ దవాఖాన వైద్యులు చికిత్స అందించి ప్రాణం పోశారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు బుధవారం వైద్యులను పోలీసులు సన్మానించారు. ఇటువంటి వైద్య సేవలతో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ పురుషోత్తం పాల్గొన్నారు.

## పింఛనొచ్చింది..

- ఎమ్మెల్యే చొరవతో వృద్ధుడికి అందిన డబ్బులు
- 'నమస్తే' కథనానికి స్పందన


పొన్నారిలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న అధికారులు

నమస్తే ఎఫెక్ట్

తాంసి, జనవరి 31 : 'పింఛనొస్తలే దయ్యా.. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వృద్ధుడి మొర' అనే శీర్షికన జనవరి 29వ తేదీన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే చొరవతో అధికారులు స్పందించారు. బుధవారం మండల కేంద్రంతోపాటు పొన్నారి గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో వృద్ధులకు పింఛన్ అందజేశారు. దీంతో మండలంలోని పింఛన్‌దారులు ఎమ్మెల్యేకు, నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.


న్యాయవాదులుతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

## రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి..

**ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్**

ఎదులాపురం, జనవరి 31 : జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులను పరిష్కరించి ఆదిలాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ సూచించారు. మార్చి 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై న్యాయవాదులతో బుధవారం కోర్టు సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. అక్షర క్రమంలో మొదటి స్థానంలో ఉన్న ఆదిలాబాద్.. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో వెనుకబడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టుల్లో 8,588కిపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయమూర్తులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమదేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ పాల్గొన్నారు.

## బ్యాటరీ దొంగల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ పురుషోత్తం

నిర్మల్ అర్బన్, జనవరి 31 : నిర్మల్ పట్టణంలో కొంత కాలంగా బ్యాటరీ దొంగతనానికి పాల్పడుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ పురుషోత్తం వివరాలను వెల్లడించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో వాహనాల బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారని ఇటీవలే సమాచారం అందిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలో పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా ఆటోలను తనిఖీ చేశారని పేర్కొన్నారు. ఇందులో ఆరు బ్యాటరీలు కనిపించగా.. స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టాం. పట్టణానికి చెందిన షాహీద్, సల్మాన్‌లు కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నామని తెలిపారు. దొంగిలించిన వస్తువులను నిజామాబాద్ జిల్లాలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నామని ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి ఆరు బ్యాటరీలు, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై శంకర్, ఐడీ పార్టీ పోలీసులను అభినందించారు.

# ముగిసిన పదవీకాలం

- నేటితో పంచాయతీ పాలకవర్గాలకు ఐదేండ్లు పూర్తి
- రేపటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన



ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం నేటి(గురువారం)తో ముగియనుంది. జనవరి 2019 సంవత్సరంలో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఫిబ్రవరి 2వ తేదీన బాధ్యతలు చేపట్టారు. నేటితో వారి ఐదేళ్ల పదవీకాలం పూర్తికానుండగా రేపటి(శుక్రవారం) నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు. పాలకవర్గాల పదవీకాలం ముగియనుండగా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన అనివార్యంగా మారింది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 468 పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులను స్థానికులు సన్మానించారు.

**రేపటి నుంచి ప్రత్యేక అధికారులు**

రేపటి నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నియామకానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పెద్ద పంచాయతీల్లో గెజిటెడ్ ఉద్యోగులు.. మధ్య, చిన్న పంచాయతీల్లో వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగులను నియమించనున్నారు. పంచాయతీ కార్యదర్శితో సమానమైన హోదా, ఆపై కేడర్ కలిగిన సిబ్బంది, అధికారులు ప్రత్యేక అధికారులుగా నియమితులుకానున్నారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలు, వ్యవసాయ అధికారులు, పశు వైద్యాధికారులు, వివిధ శాఖల్లో పనిచేసి ఇంజినీర్లు, ఐసీడీఎస్, హెల్త్ సూపర్‌వైజర్లు, హార్టికల్చర్ ఏవోలు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సూపరింటెండెంట్‌లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, రికార్డు అసిస్టెంట్‌లు, ఏఈవోలకు బాధ్యతలు అప్పగించనున్నారు.

**పల్లెల ప్రగతిపై కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

కేసీఆర్ ప్రభుత్వం పల్లెల ప్రగతికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. 2018లో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. గ్రామాల అభివృద్ధికి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేసింది. పంచాయతీలకు క్రమంగా నిధులు మంజూరు చేయడంతోపాటు ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించింది. పచ్చదనం, పరిశుభ్రత, తాగునీరు, విద్య, వైద్యం, రవాణ, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. పల్లెల్లో రోడ్లు, మురికికాల్వల నిర్మాణం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీ భవనాలు, రైతు వేదికల నిర్మాణాలను చేపట్టింది. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల ఫలితంగా పలు పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాయి.

## భైంసాలో కవాతు

భైంసా, జనవరి 31 : పట్టణంలో బుధవారం ఆర్ఏఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి పంజేషా చౌక్, భట్టిగల్లి, కిసాన్ గల్లి, బస్టాండ్ ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ కవాతులో ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వినోద్ గోపి, భారతి, పట్టణ సీఐ రాజారెడ్డి పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న ఆర్ఏఎఫ్ బలగాలు

## సీఎం సభను విజయవంతం చేయండి..

ఇచ్చోడ, జనవరి 31 : ఇంద్రవెల్లి మండలంలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రేపు జరగనున్న సీఎం సభలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో బీఆర్ఎస్ గుడిహత్నూర్ మాజీ మండల కన్వీనర్ బ్రహ్మానందం, మన్నూర్ మాజీ సర్పంచ్ జలేంధర్‌లు ఉన్నారు.

# పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి..

- రేపు ఇంద్రవెల్లికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారు..
- నేటితో పనులు పూర్తి చేయాలి..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి, జనవరి 31 : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో శుక్రవారం సీఎం పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి పరిశీలించారు. నాగోబా ఆలయంతోపాటు హెలిప్యాడ్ గ్రౌండ్, దర్బార్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2(రేపు)న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి, కేస్లాపూర్ పర్యటన నేపథ్యంలో అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం పర్యటనలో భాగంగా చేపడుతున్న అన్ని రకాల పనులను గురువారం వరకు పూర్తి చేయాలని సూచించారు. నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన, స్టాల్స్ సందర్శన, దర్బార్ హాల్‌లో గ్రూపు మహిళలతోపాటు అధికారులతో నిర్వహించే సమావేశంలో సీఎం పాల్గొంటారని తెలిపారు. అమరవీరుల స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటుతోపాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరుల స్తూపాన్ని సందర్శించి ఎమ్మెల్యేతో కలిసి నివాళులర్పించారు. అంతకుముందు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.


హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

# నాగోబాకు సిరి'కుండ'

- దశాబ్దాలుగా కుండలను అందిస్తున్న గుగ్గిళ్ల వంశీయులు
- మట్టితో ముంతలు, దీపాలు, రొట్టె పెంకల తయారీ
- కుండల తయారీలో నిమగ్నమైన కుమ్మరులు
- ఈనెల 9వ తేదీన నాగోబా మహాపూజ

*ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా జాతరకు సిరికొండ మండలానికి ప్రత్యేక అనుబంధం ఉంది. పూర్వకాలం నుంచే నాగ దేవతకు గుగ్గిళ్ల వంశీయులు కుండలను అందించడం సంప్రదాయంగా వస్తున్నది. ఈ మట్టి కుండలను తాగు, వంట నీటి కోసం వినియోగిస్తారు. జాతరకు రెండు రోజుల ముందే మెస్రం వంశీయులు సిరికొండకు చేరుకుని పూజల కోసం తీసుకెళ్తారు. ఈ కుండలపై 'నమస్తే' ప్రత్యేక కథనం..*


నాగోబాకు కుండలు తయారు చేస్తున్న కుమ్మరులు


తయారు చేసిన కుండలు

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 31 : ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ ఒక చారిత్రక గ్రామం. ఈ గ్రామంలో సుమారు 1000 కుమ్మరి కులస్తుల కుటుంబాలు ఉండేవి. ఇందులో అత్యధికంగా గుగ్గిళ్ల వంశస్తులే ఉండేవారు. వీరు తయారు చేసిన కుండలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించి కుటుంబాలను పోషించుకునే వారు. వీటి ద్వారా వచ్చే డబ్బులు పోషణకు సరిపోకపోవడంతో ఇతర ప్రాంతాలకు కొందరు వలస వెళ్లారు. ప్రస్తుతం ఇక్కడ నివసించే కుమ్మరి కులస్తుల్లో అధికంగా గుగ్గిళ్ల వంశస్తులే ఉన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేతివృత్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రధానంగా కుమ్మరి కులస్తులకు సబ్సిడీపై రుణాలతోపాటు సరుకులు, వస్తువులు, పరికరాలను ఇస్తూ ప్రోత్సహిస్తుండడంతో గుగ్గిళ్ల వంశీయులు తిరిగి స్వగ్రామాలకు చేరుకుని వారి వృత్తిని కొనసాగిస్తున్నారు.

**కుండల చరిత్ర**

మెస్రం వంశానికి చెందిన పెద్ద మనిషికి ఒక రోజు నాగ దేవత కలలోకి వచ్చి సిరికొండలోని గుగ్గిల్ల వంశీయులు తయారు చేసిన కుండలనే పూజకు వాడాలని చెప్పింది. అప్పటి నుంచి కుండలను తయారు చేయించి పూజకు వాడుతున్నారు. మొదటగా గుగ్గిళ్ల వంశానికి చెందిన రాజన్న, తర్వాత లస్మన్న, తదానంతరం ఆయన కుమారుడు స్వామి కుండలను అందజేస్తున్నారు. మహాపూజకు రెండు రోజుల ముందే మెస్రం వంశీయులు ఎడ్లబండ్ల ద్వారా సిరికొండకు వచ్చి కుండలను తీసుకుని గంగకు వెళ్తారు. ఈ కుండల్లో గంగాజలాన్ని నింపి కేస్లాపూర్‌కు గ్రామ సమీపంలో ఉన్న ఒక మర్రి చెట్టు కింద పెడతారు. అనంతరం పూజలు చేసి ఈ కొత్త కుండలను ఆలయం వద్దకు తీసుకెళ్తారు. ఈ గంగాజలంతో నాగోబా దేవతకు అభిషేకం చేస్తారు. ఈ కుండల్లో వండిన నైవేద్యాన్ని దేవతకు సమర్పిస్తారు. ఈ నీటినే పూజకు ఉపయోగిస్తారు.

**నాగోబాకు తయారు చేసే కుండలు**

జొన్నలతో నైవేద్యం వండడానికి రెండు పెద్ద కుండలు, వనధాన్యాలతో నైవేద్యం వండడానికి 16 సాధారణ కుండలు వీటికి 16 మూతలు, 55 కుండలను నీటికి వినియోగిస్తారు. ఈ నీటికుండల్లోనే గంగాజాలాన్ని తీసుకొచ్చి నాగ దేవతకు అభిషేకం చేస్తారు. 45 కడుముంతలను పూజకు ఉపయోగిస్తారు. 150 దీపాలను ఆలయం చుట్టూ వెలిగించేందుకు ఉపయోగిస్తారు. ఎనిమిది రొట్టె పెంకల్లో వృద్ధులకు రొట్టెలు తయారు చేసి ప్రసాదంగా అందజేస్తారు. జాతరలో సంప్రదాయ వాయిద్యాలు, కిక్రి వాయిస్తూ, పాటల ద్వారా మట్టి కుండల చరిత్రను వివరిస్తారు. గుగ్గిళ్ల వంశీయులను జాతర సమయంలో నాగోబా దేవాలయానికి తీసుకెళ్లి సన్మానిస్తారు.

**మా అదృష్టం**

నా భార్య కళతో కలిసి కుండలు తయారు చేసి నాగోబా దేవతకు అందించడం అదృష్టంగా భావిస్తున్నా. తాము చేసిన కుండలనే వాడడం గర్వంగా ఉంది. జాతరలో మా వంశీయులను సన్మానించడం సంతోషంగా ఉంది. ప్రజల్లో మాకు మంచి గుర్తింపు లభిస్తున్నది. నాగోబా దేవత తమ వంశస్తులను చల్లగా చూస్తున్నది.


- గుగ్గిళ్ల స్వామి, కుమ్మరి, సిరికొండ.

# నేటి నుంచి ప్రాక్టికల్స్

- మూడు విడుతల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణ
- నిర్మల్ జిల్లావ్యాప్తంగా 42 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 8,489 మంది విద్యార్థులు
- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం


నిర్మల్‌లోని ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం

నిర్మల్ అర్బన్, జనవరి 31 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు మాధ్యమిక విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి 15వ తేదీ వరకు కొనసాగనుండగా..16వ తేదీన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ ఉండనుంది. 42 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఇందులో 38 సెంటర్స్‌ను సైన్స్‌కు, నాలుగు కేంద్రాలను ఒకేషనల్ విద్యార్థులకు కేటాయించారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

**హాజరుకానున్న 8,489 మంది**

జిల్లా వ్యాప్తంగా 63 కళాశాలలు ఉండగా.. ఇందులో 13 ప్రభుత్వ, 50 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. 8,489 మంది విద్యార్థులు హాజరు కానుండగా.. ఇందులో 6,458 మంది జనరల్, 2,031 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్స్‌ను పంపిణీ చేశారు. కాగా.. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని నిర్మల్ జిల్లా మాధ్యమిక శాఖ నోడల్ అధికారి పరశురాం తెలిపారు.


కొనసాగుతున్న సీఎం సభా వేదిక పనులు

## ముమ్మరంగా సభా ఏర్పాట్లు

ఇంద్రవెల్లి, జనవరి 31 : రేపు(శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లికి రానున్న నేపథ్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అమరవీరుల స్తూపం వద్ద సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమరవీరుల స్తూపానికి రంగులు వేస్తున్నారు. ఎస్పీ ఆలం ఆదేశాల మేరకు బాంబ్‌స్క్వాడ్ బృందంతోపాటు డాగ్‌స్క్వాడ్‌తో రోడ్లకు ఇరువైపులా తనిఖీలు చేశారు.

# జాగ్రత్తలు తీసుకోవాలి..

- ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం
- రోడ్డు భద్రతపై అవగాహన


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జనవరి 31 : ప్రమాదం జరిగినపుడు బాధపడే కన్నా.. ముందే జాగ్రత్తలు తీసుకుంటే మేలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రజలు, విద్యార్థులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ చైతన్య పరుస్తున్నామని తెలిపారు. యువత వాహనాలు నడుపుతున్నప్పుడు తల్లిదండ్రులను మదిలో ఉంచుకోవాలని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వేగంగా వాహనాలను నడుపొద్దని సూచిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు కేసీబీ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, రూరల్ సీఐ సైదారావు, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్, మావల ఎస్ఐ వి.విష్ణువర్ధన్, నలంద కళాశాల డైరెక్టర్ విజయబాబు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం


లంగ్డాపూర్‌లో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సోన్, జనవరి 31 : నిర్మల్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు కేంద్రం ద్వారానే నేరుగా నిధులు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ ఈఈ శంకరయ్య, డీఈ తుకారాం, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో కలీం పాల్గొన్నారు.

**సోన్‌లో చెక్కుల పంపిణీ**

సోన్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోన్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మానస అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల సమావేశాలు మొక్కుబడిగా కాకుండా సభ్యుల ప్రశ్నలకు జవాబులు ఇచ్చే విధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ తుకారాం, ఎంఈవో శంకర్ పాల్గొన్నారు.

## కుమ్రం భీం జాతిరత్నం

**విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి జోగు రామన్న**


కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రామన్న, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్

భీంపూర్, జనవరి 31 : ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన కుమ్రం భీం జాతిరత్నం అని బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పేర్కొన్నారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి)లో బుధవారం ఆయన ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీ నగేశ్, సర్పంచ్ రమాబాయితో కలిసి కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన పూర్తిగా అధ్వానంగా ఉందని, ఇప్పుడు కేసీఆర్ ఉంటే బాగుండు అని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడుతారని ఆకాంక్షించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. సర్పంచ్ రమాబాయి-లస్మన్న దంపతులు వారి కుమారుడు వైభవ్ యాదవ్ స్మారకంగా భీం విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కరంజి, గుబిడి రోడ్డు, గోముత్రి రిజర్వాయర్ సాకారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివాసీ పంచాయతీలను అభివృద్ధి చేసింది కేసీఆర్ అని మాజీ ఎంపీ నగేశ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు సుధాకర్, తాటిపెల్లి రాజు, ఎంపీపీ కుడిమెత రత్నప్రభ, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, సర్పంచ్‌లు హనుమద్దాసు, రమాబాయి, బాదర్, వేణు, నాయకులు నరేందర్‌యాదవ్, సంజీవ్‌రెడ్డి, గంగయ్య, అనిల్, సంతోష్, లస్మన్న, ఓమయ్య, నితీన్, ఉల్లాస్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా వైద్య పరీక్షలు నిర్వహించాలి

భైంసా, జనవరి 31 : అంగవైకల్యం ఉన్న వారికి పారదర్శకంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో సదరం క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు అంగవైకల్యం ఉన్న వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, మీసేవలో స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈయన వెంట ఎంపీపీ రజాక్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రీతమ్ ఉన్నారు.


సదరం దరఖాస్తు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్